క్లుప్తంగా

ఎస్సీ కాలనీ జలమయం


కాలనీలోకి చేరిన వరద నీరు

కొనకనమిట్ల: విస్తారంగా కురిసిన వర్షాలకు మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీలోకి వరద నీరు చేరడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పొలాల్లోని వర్షం నీరు కాలనీలోకి చేటంతో పలు గృహాలు ముంపునకు గురయ్యాయి. కాలనీలో డ్రైయినేజీ లేకపోవడంతో వీధిలో నడిచే పరిస్థితి కూడా లేదు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కాలనీలో పర్యటించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

సాగర్ పైప్ లైన్‌కు లీకేజీ


పైప్ లైన్ లీకై వృథాగా పోతున్న సాగర్ నీరు

పొదిలి రూరల్: దర్శి నుంచి పొదిలికి వచ్చే సాగర్ మెయిన్ పైప్‌లైన్‌కు పొదిలి మండలంలోని కుంచేపల్లి వద్ద లీకేజీ ఏర్పడటంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. గతంలో ఇదే ప్రదేశంలో రెండు సార్లు పైప్ లైన్ లీక్ కావడంతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ


రగ్బీలో ప్రతిభ చాటిన క్రీడాకారులు

కొనకనమిట్ల: ఇటీవల ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచిందని కోచ్, పీడీ వై.బాలగురవయ్య పేర్కొన్నారు. జిల్లా జట్టులో ప్రతిభ చాటిన గొట్లగట్టు జెడ్పీ స్కూల్ విద్యార్థులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, పి.యువరాజుకు ప్రశంశా పత్రాలు అందజేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికల జట్టులో రాజారపు లక్ష్మీకల్పన జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైందని తెలిపారు. పీడీతోపాటు క్రీడాకారులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి


పగడి అల్లూరిరెడ్డి(ఫైల్)

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగిడి అల్లూరి రెడ్డి(71) శనివారం రాత్రి మృతి చెందారు. పగిడి అల్లూరిరెడ్డి జేపీ చెరువు గ్రామ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో 2016లో కాశీనాయన రెడ్ల అన్నదాన సత్రం స్థాపించి, తన సొంత ఖర్చుతో భవనం నిర్మించడమే కాకుండా ప్రతి శనివారం భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో భాధపడుతూ చికిత్స పొందుతున్నారని, శనివారం జేపీ చెరువు గ్రామంలోని తన నివాసంలో మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


నాగంపల్లిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు


సోమిదేవిపల్లెలో దెబ్బతిన్న మిరప తోట


అనుమలవీడులో నీట మునిగిన మినుము

అన్నదాతలకు అపార నష్టం

- వారంరోజులపాటు దంచికొట్టిన వాన
- నీట మునిగిన పంట పొలాలు
- తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు

కొనకనమిట్ల/రాచర్ల:

బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆదివారం కూడా ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు వర్షం కారణంగా దెబ్బతినడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. కొనకనమిట్ల మండలంలో వారం రోజులుగా 130 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలో ఎక్కువగా అలసంద, మినుము పంటలతో పాటు పొగ తోటలు, మిర్చి, కంది పంటలు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన పొలాలను ఆదివారం ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పరిశీలించారు. పలు గ్రామాల్లో అలసంద, మినుము, పొగాకు, మిర్చి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు.

రాచర్ల మండలంలో..

రాచర్ల మండలంలోని గుడిమెట్ట, అనుమలవీడు, మేడంవారిపల్లె, అకవీడు, గంగంపల్లె, పాలకవీడు, సోమిదేవిపల్లె, రామాపురం, కాలువపల్లె గ్రామాల్లో పొగాకు, మినుము, మిర్చి, నువ్వులు, అరటి, పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయి. వర్షం నీరు నిల్వ ఉండటంతో పొగాకు, మినుము, పత్తి, కంది పంట పొలాలు ఉరకెత్తుతున్నాయి. ఆకవీడులో గాలి,వాన కారణంగా అరటి చెట్లు విరిగి నేలకొరిగిపోయాయి. అక్కడక్కడా మిర్చి దెబ్బతింది. పొగాకు కొట్టుడుకు వచ్చే సమయానికి వర్షం కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.


నాగంపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు


నాగంపల్లి, పేరారెడ్డిపల్లి పరిధిలో ఉరకెత్తుతున్న మినుము



రెండు ఎకరాల్లో పొగాకు నష్టం

"నేను రెండు ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశాను. పొగాకు పంటను సాగు చేసేందుకు ఇప్పటికే ఎకరాకి రూ.50 వేలు ఖర్చు పెట్టాను. వర్షం రాకముందు నా పొగాకు వెపుగా పెరిగి ఆకు కొట్టుకు వచ్చింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొగాకు పైరులో నీరు నిలబడి దాదాపు 1.5 ఎకరా పొగాకు పూర్తిగా దెబ్బతిన్నాది. 1.5 ఎకరాకి దాదాపు రూ.2 లక్షలు నష్టం వటిల్లింది. ప్రభుత్వం అంచనా వేసి పొగాకు రైతులకు అదుకోవాలి.

– షేక్. మొహిద్దీన్, పొగాకు రైతు, అనుమలవీడు


గుడిమెట్టలో వర్షానికి దెబ్బతిన్న పొగాకు


రామాపురంలో ఎర్రగా మారి ఒడలిపోయిన పత్తి

కూలేందుకు సిద్ధంగా వంతెన


ప్రమాదకరంగా మారిన పురాతన బ్రిడ్జి


బ్రిడ్జి కింది భాగంలో బయటపడిన ఇనుప చువ్వలు

రాచర్ల: మండలంలోని పాలకవీడు నుంచి శీలంవెంకటరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డు సమీపంలో పురాతన వంతెన దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ మార్గంలో రాచర్ల నుంచి అనుమలవీడు, పాలకవీడు, సంటపేట, రామాపురం, సోమిదేవిపల్లె గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పొలం పనులకు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో తిరుగుతుంటాయి. ఇప్పటికే బ్రిడ్జి రక్షణ గోడలు కూలిపోయి, అడుగు భాగం కుంగి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. బ్రిడ్జిపై భారీ వాహనాలు వెళ్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కలాం అవార్డు గ్రహీతలకు అభినందనలు


వెన్నా నారాయణరెడ్డి దంపతులకు అవార్డు అందిస్తున్న అతిథులు


అవార్డు అందుకుంటున్న గఫార్ అలిఖాన్

తర్లుపాడు: బాపట్ల జిల్లాలోని కేవీఆర్ అండ్ ఎంకెఆర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వెన్నా నారాయణరెడ్డి ఆదివారం సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏసీ కాలేజీలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అత్తమామలు బండి కేశవరెడ్డి, నారాయణమ్మ, బావమరుదులు బండి శ్రీనివాసరెడ్డి, రామాంజనేయరెడ్డి, స్వగ్రామం చెన్నారెడ్డిపల్లి వాసులు, మార్కాపురంలోని బంధుమిత్రులు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. మార్కాపురంలోని ఎస్‌కేపీ కళాశాల డిగ్రీ స్నేహితులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

■ కంభం: స్థానిక ఎంజీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గఫార్ అలిఖాన్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా ఆయనకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు గఫార్ అలిఖాన్‌ను అభినందించారు.

పశువైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి


పశుపోషకుడితో మాట్లాడుతున్న తిరుపతిరావు

కొమరోలు: కొమరోలులోని పశువైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇడమకల్లు, కొమరోలు, నల్లగుంట్ల, బాదినేనిపల్లె గ్రామాల్లో పర్యటించి గొర్రెల కాపరుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరోలు పశువైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో పశుకాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత 8 నెలల నుంచి పశువైద్యశాలలకు మందుల సరఫరా ఆగిపోయిందని, కొత్త ప్రభుత్వం వచ్చి 4 నెలలు గడుస్తున్నా సమస్యలపై దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఆవులయ్య, రామరాజు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

తర్లుపాడు: ప్రేమోన్మాది చేతిలో తీవ్రంగా గాయపడిన యువతి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంపై రాష్ట్ర నూర్‌బాషా యువజన సంఘం అధ్యక్షుడు డీపీ మస్తాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో చిన్నారులపై జరుగుతున్న దారుణాలను ఆయన ప్రస్తావించారు. ప్రేమ పేరుతో బాలికలు, యువతులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

సర్పంచ్ భర్తకు పలువురి పరామర్శ


సర్పంచ్ భర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు సర్పంచ్ షాజహాన్ భర్త గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మురారి, మండలంలోని సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య సమాచారం తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. టీడీపీ నేత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి భాషాపతిరెడ్డి, డి.మస్తానయ్య, బొంబాయి వలి తదితరులు షాజహాన్‌ను పరామర్శించారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బేస్తవారిపేట: స్థానిక పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.93 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం ఏచూరి పోరాటం


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

తర్లుపాడు: మతతత్వ రాజకీయాలపై కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి రాజీలేని పోరాటం చేశారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాలనాగయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యునిగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా ఏచూరి దేశానికి సేవలందించారని కొనియాడారు. సీతారాం ఏచూరిని నేటితరం యువతకు ఆదర్శనీయమన్నారు. రైతు సంఘం కార్యదర్శి పాపిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, నెహ్రూ యూత్ అధ్యక్షులు పుల్లయ్య, నేవీ రిటైర్డు ఉద్యోగి ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవారి సమారాధన


అమ్మవారిని తులాభారం తూస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి సమారాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి తులాభారంలో తూగిన నగదును సోమిశెట్టి పాండురంగారావు రూ.50 వేలకు, లడ్డూను టీవీఎస్ ఏజెన్సీ నిర్వాహకులు రూ.16,500కు, అమ్మవారి చీరలను రూ.2,62000కు పలువురు భక్తులు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వాడకట్టు సత్యనారాయణ, గర్రె సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.1/2018 in O.S.No.49/2016

గంజి రంజిత్‌కుమార్ ....D.Hr.

Vs

గంగిసెట్టి రాజేశ్వరి అలియాస్ రాజేశ్వరి గుప్త .....J.Dr.

వేలం ప్రకటన

పై నెంబరు E.P. షెడ్యూలులోని Items 1 to 3 గల ఇంటిని D.Hr బాకీ రాబట్టు నిమిత్తం ఘనమైన కోర్టులో తేది.16.11.2024న ఉదయం 10.30 ని॥లకు బహిరంగ వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించడమైనది. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు వేలంలో పాల్గొన వచ్చును.

షెడ్యూలు ఆస్తి

ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్‌డిస్ట్రిక్ట్ మరియు మార్కాపురం మండలం మరియు పట్టణంలోని S.No.338/2 లోని D.No.4/486 లోని 130 చ.గ.లు లేక 109.2 చ.మీ.లోని 3 Items కు హద్దులు. తూర్పు: రోడ్డు, పడమర: సుగ్రీవ వెంకట సత్యనారాయణ గోడౌన్, ఉత్తరం: చిన్నమ్ రాజ భాస్కర్ ప్రసాద్ గారి జాయింటు గోడ, దక్షిణం: పస్పేరు షల్లయ్య గారి జాయింట్ గోడ.

Item No.1:- తూర్పు-పడమర: 75 అడుగులు. ఉత్తర – దక్షిణం : 11 1/2 అడుగులు మొత్తం 868 చ.అడుగులు.

Item No.2:- తూర్పు-పడమర: 12.4 అడుగులు. ఉత్తరం – దక్షిణం : 14.8 అడుగులు వెరశి మొత్తం 184 చ.అడుగులు.

Item No.3:- తూర్పు – పడమర: 8.3 అడుగులు. ఉత్తర – దక్షిణం : 14.1 అడుగులు మొత్తం 118 చ.అడుగులు.

వెరశి Item No.1to3 నకు మొత్తం కొలతలు 1165 చ.అడుగులు.
Market Value Rs.58,56,000/-
D.Hr Value Rs.18,69,000/-
Amina విలువ Rs.30,00,000/-
వేలం తేది: 16-11-2024.
ఫర్దర్ హియరింగ్ : 22-11-2024.
(కోర్టు వారి వుత్తర్వులతో)

S.షహనాజ్ బేగం, లాయరు, మార్కాపురం, ప్రకాశం జిల్లా.

త్రిమూర్తి స్వరూపిణిగా అల్లూరి పోలేరమ్మ


త్రిమూర్తి స్వరూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలను భక్తులు పూజించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈఓ, చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు


గంగమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని పూలతో అలంకరించి పూజలు చేశారు.

కనువిందు చేసిన హరివిల్లు



మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. గత వారంరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా కొద్దిసేపు ఎండ కాయగా.. కాసేపు వర్షం పడింది. సాయంత్రం వేళ పట్టణ శివారులోని దరిమడుగు వద్ద ఈ దృశ్యం కనిపించింది.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు పంపిణీ


గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

మార్కాపురం: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆవోపా(ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో బహుమతులు అందించారు. గత నెల 29న మార్కాపురం తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను చంద్రిక, హైమావతి, ఎస్‌కే అస్రఫ్‌ఉన్నీషా, జూనియర్స్ విభాగంలో వేదేశ్వవి, రాజ్యలక్ష్మి, సమీరతోపాటు మరో 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఆవోపా కార్యదర్శి లక్ష్మణరావు, రాచపూడి సుబ్బారావు, జీవీ సుబ్రహ్మణ్యం, రామశేఖర్, కోటిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వల నిండా పడాలి చేపలు!


పులివాగులో చేపలు పడుతున్న గుంతపల్లె వాసులు

కొమరోలు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొమరోలు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని గుంతపల్లె గ్రామం సమీపంలో కల్వర్టు కింద పులివాగు ప్రవహిస్తుండటంతో స్థానికులు వలలతో చేపలవేట సాగిస్తున్నారు.